# మారేప్పుడు?

రచన:
శ్రీ శీశెట్టి రామకృష్ణ.

'ఏమండి! లేవండి, టైమ్ ఏడయ్యింది' అంది ప్రసన్న మంచము దగ్గరికొచ్చి.

'ఉండు ప్రసన్నా లేస్తున్నాను' అంటూ లేచి కొంగు పట్టుకున్నాడు వెంకటరావు.

'చాల్లేండి - సమయము సందర్భములేని సరసము' అంటూ కొంగులాక్కొని వంటగదిలో కెళ్ళిపోయింది.

బ్రెష్ పట్టుకొని పెరడులో కెళ్ళాడు వెంకటరావు. దగ్గిరుండి నీళ్ళు, టవలు అందించింది ప్రసన్న.

స్నానముచేసి డ్రెస్ వేసుకున్నాడు వెంకటరావు. టిఫన్ తెచ్చి ఇచ్చింది ప్రసన్న.

ప్రసన్నవైపు చూస్తూ—

'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, అని నీలాంటి ఆడవాళ్ళనుచూసే అని ఉంటారు మన పెద్దలు' అన్నాడు వెంకటరావు.

'స్త్రీని ప్రత్యక్షంగా పొగడొద్దని మీపెద్దలు చెప్పలేదేమిటండీ' అంది ప్రసన్న నవ్వుతూ.

'స్త్రీని ప్రత్యక్షంగా పొగిడితే గర్వము పెరుగుతుందని వద్దు అంటారు. అయినా అలాంటివి నీగురించి, నీలాంటి వారిగురించి కావులే' అన్నాడు వెంకటరావు.

'ఆహాఁ. అలాగటండి. నన్నేమీ మా అమ్మావాళ్ళు ప్రత్యేకంగా కనలేదే' అంది ప్రసన్న చిత్రంగా కళ్ళు త్రిప్పుతూ.

'ప్రసన్నా, మీ తల్లిదండ్రులు ప్రత్యేకంగా కన్నంత మాత్రాన నీకున్న ఈ సహనము, సంస్కారము అలవడతాయంటావా?' అన్నాడు వెంకటరావు.

'మరి ఎలా వస్తాయో సెలవిస్తారా?' అంది ప్రసన్న నాటకీయంగా.

'ప్రొద్దునే నాతో తగువు పెట్టుకుంటున్నావు, ఏమిటి సంగతి?' అన్నాడు వెంకటరావు, ఏమనాలో తోచక.

'మహాశయా బుద్ధి గడ్డితింది. ఈ అపరాధము క్షమించి ఈ దీనురాలొసంగు ఫలహారము భుజించమని కడు దీనంగా వేడుకుంటుంది' అంది ప్రసన్న నవ్వు నాపుకుంటూ.

'నీ అపరాధమునకు సరియగు శిక్ష నాకీ ఫలహారము తినిపించడం ఏమంటావు ధర్మపత్నీ' అన్నాడు వెంకటరావు నవ్వుతూ.

'తప్పదు కదా' అని టిఫిన్ తినిపించడము మొదలు పెట్టింది నవ్వుతూ ప్రసన్న.

'మరి నీకో' అంటూ ఎదురు తినిపించడము మొదలు పెట్టాడు వెంకటరావు.

'అసలు మీ గొడవేగాని, నేను చెప్పింది వినిపించుకోరేమిటి' అంది ప్రసన్న.

చెప్పమన్నట్టు చూశాడు వెంకటరావు.

'సాయంకాలము సినిమా కెళదామండి' అంది ప్రసన్న.

'అలాగే' అంటూ తలాడించాడు వెంకటరావు.


TRADE MARK
MEXICO
KNITTING MILLS

ఎల్లప్పుడూ - మాచే తయారుచేయబడిన

♦ పావ్ లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్
♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్

బనియన్లనే వాడండి. అవి బనియన్లకెల్లా అత్యుత్తమమైనది.

**MAXICO KNITTIG MILES**
**43-A, Cauvery St—TIRUPUR - 638602**

అవునట్టు మరిచిపోయాను. మీ నూకరత్నము 'వచ్చే సిందండి' అంది ప్రసన్న సీరియస్‌గా.

'నూకరత్నము ఎవరు ?' అన్నాడు వెంకటరావు ఆశ్చర్యముగా,

'ఇంకెవరు, మీమేనమామకూతురు' అంది ప్రసన్న.

'మళ్ళీ ఎందుకొచ్చిందంట ?' అన్నాడు వెంకటరావు.

'దానాయన కొట్టి తగలేసేడట్ట' అంది ప్రసన్న నెమ్మదిగా.

'సర్లే కాని దానిగొడవ ఎందుకుగాని నీపని చూసుకో. నేను కోళ్ళఫారం కెళతాను అని చెప్పి ఫారముకేసి బయలుదేరాడు వెంకటరావు.

ఇది వెంకటరావు ప్రసన్నల జీవితము. భార్యా భర్త అంటే భరించేవాడు భర్త అని, భరింపబడేది భార్య అని. ఆ భర్తకు ఏకష్టము కల్గకూడదని తన సుఖాన్నయినా వదులుకొని భర్తకు సేవ చేస్తుంది ప్రసన్న. బయటికెళ్ళి ఎన్నోవిషయాలలో, ఎన్నోవ్యవహారాలలో బుర్ర బద్దలు కొట్టుకొని మగాళ్ళు ఇంటికి వస్తారు, వారిని సాదరంగా ఆహ్వానించి కూర్చోపెట్టి వారి అవసరాలు తీర్చితే, వారి హావభావములు గమనించి మసలుకుంటే భార్యనిమించిన దేవత లేదు, గృహాన్నిమించిన ఆలయంలేదు. ఇది ప్రసన్న భావన.

ఇక వెంకటరావు విషయంలోకొస్తే, భార్య అవసరాలు గమనించి ఆమెను ఉన్నంతలోనే సంతృప్తిపర్చకపోతే ఆ మగాడిజీవితము అవవసరము. ఇది వెంకటరావు భావన.

అందుకే వారిజీవితము ఒడుదుడుకులు లేకుండా సాగుతుంది. కోళ్ళఫారం దగ్గిరికిచేరి అమ్మకానికి గుడ్లు, అమ్మిన గుడ్లుతాలూకు లెక్కలు అన్ని సరిచూసి విశ్రాంతిగా చెట్టు కిందకువెళ్ళి కూర్చున్నాడు వెంకటరావు.

తీరికగా కూర్చున్న వెంకటరావుకు నూకరత్నముసంగతి గుర్తుకువచ్చి గుండెలో కెలికినట్టు అయ్యింది. గతమంతా సీనిమా రీలులా తిరగడము మొదలుపెట్టింది.

* * *

'ఎంతటివారైనా కాంత దాసులే' అన్నాడు త్యాగరాజు. కాని వెంకటరావు మేనమామ సామినాయుడుమాత్రం, భార్య సూర్యకాంతానికి సంపూర్ణ దాసుడు. ఆవిడగూర్చి చెప్పాలంటే ఊరంతా నంది అంటే ఆమె పంది అంటుంది. ఆమెభర్త సై అంటాడు. ఇది వారి భార్యా భర్తల సంగతి. ఇంకా వాళ్ళింట్లో ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగపిల్లలు పెద్దవాళ్ళు, ఆడపిల్లలు చిన్నవారు. పెద్దపిల్ల నూకరత్నాన్ని తప్పించి మిగతావాళ్ళని మనిషికి ఏమి కావాలిరా అంటే 'తిండి' అని మూకుమ్మడిగా చెప్పగల సమర్థలు. వారికి తిండితినని సమయాలు ఉన్నాయంటే అవి చేల్లో ఉన్నంతసేపే. వాళ్ళింట్లో కొంచెమైన చదువు

Regd. No. 6233




Phone : 21852

* కలర్ బనియన్లు, * డోరియా, * జెట్టీలు.

కున్నది ఒక్క సోమినాయుడుమాత్రమే. అందరికంటే రూపవతి ఒక్క నూకరత్నము మాత్రమే. సోమినాయుడు అక్క సంతానమే వెంకటరావు. చదువుకున్నది బి. ఏ. చేస్తున్నది నిరుద్యోగము: ఉన్న ఆస్తిఅంతా ఒక పెంకుటిల్లు మాత్రమే. ఆరోజుల్లోనే వెంకటరావు తల్లి 'తమ్ముడూ రత్నాన్ని వెంకటికి చేసేద్దామురా అంది.

'ఉద్యోగము లేదు, సద్యోగము లేదు. ఏంపెట్టి పోషిస్తాడు పెళ్ళాన్ని' అన్నాడు సామినాయుడు.

'మావయ్యా, చదువుకున్న ప్రతివాళ్ళకి ఉద్యోగము ఇవ్వాలంటే ప్రభుత్వముమాత్రము ఎన్నిపోస్టులు సృష్టించ గలదు. అవకాశము చూసుకొని ఏదో చిన్నపరిశ్రమ పెట్టుకోవచ్చునని నా ఆలోచన' అన్నాడు ప్రక్కనేఉన్న వెంకటరావు.

'నీగొడవ ఎవ్వడికి కావాలి, అయినా మా అమ్మాయి ఉద్యోగస్థుడుకితప్ప మరెవ్వడి కివ్వను. ఉద్యోగము తెచ్చుకొని నాదగ్గిరికి రా. అంతవరకు రాకు అని నిక్కచ్చితంగా చెప్పాడు సామినాయుడు.

ఇది జరిగిన మూడునెలలకు ప్రక్కఊరు పంచాయతీ మెంబరు భద్రరావు తనకూతురు నిస్తానంటూ ముందుకు వచ్చాడు.


ఫోన్ నెం: 21386



Saradha
—KNITTING MILLS—
TIRUPUR-638604.



# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

| | |
|---|---|
| విడి ప్రతి | ... 50 పైసలు |
| సంవత్సర చందా | ... రూ. 12-00 |

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 079.


పెళ్ళి ఘనంగానే జరిపించారు. మావగారు పలుకుబడితో ప్రభుత్వము అర్థికసహాయంతో కోళ్ళఫారం ఒకటి ఏర్పాటుచేసుకొని దానినే అభివృద్ధిపరిచాడు వెంకటరావు.

వెంకటరావు పెళ్ళితోపాటు సోమినాయుడు కూతురు పెళ్ళికూడ జరిగింది, పెద్ద ఉద్యోగస్థుడితో.

ఆ ఉద్యోగస్థుడు నూకరత్నముతో నాలుగునెలలు కాపురంచేసి తన్ని తగలెయ్యడముకూడ జరిగింది. మళ్ళీ నూకరత్నముతో కాపురం చెయ్యడము జరిగింది. మళ్ళీ.... ఇప్పుడు....

అసలు దీనికి కారకు లెవ్వరు ?

ఒకరి కర్మానికి వేరెవ్వరు బాధ్యులు అంటారు.

కాని నూకరత్నం కర్మానికి బాధ్యుడు సోమినాయుడు. ఎలాగంటారు ?

ప్రతి ఆడపిల్ల తండ్రి ఉద్యోగస్తుడుగురించి ఎన్నో తంటాలుపడడ మెందుకు. ఆ వచ్చేవాడికి లక్షలు కట్నమ పొయ్యడము ఎందుకు ? ఉదోగ్యవ్యామోహములో వ్యసనపరుడెవ్వడో మంచివాడెవ్వడోకూడ తెలిసికోరు, పట్టించుకోరు,

వ్యసనములున్న ఉద్యోగికంటే
వ్యసనములులేని నిరుద్యోగి మేలు.

ఈసంగతి మా మావయ్యలాంటివాళ్ళు ఎప్పుడు గుర్తిస్తారు. 'మార్పెప్పుడు' అనుకున్నాడు ఆవేదనతో లేస్తూ వెంకటరావు.